సాక్షి
పెద్దపల్లి

గురువారం । 12 । అక్టోబర్ । 2023

రసవత్తరంగా రెస్క్యూ పోటీలు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి జోనల్‌స్థాయి రెస్క్యూ పోటీలు బుధవారం ఆర్జీ–2 మెయిన్ రెస్క్యూస్టేషన్ ప్రాంగణంలో రసవత్తరంగా జరిగాయి. పోటీల్లో ఆరు జట్లు పాల్గొన్నాయి. ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్య నారాయణ, కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, రీజియన్ సేఫ్టీ జీఎం ఎస్.సాంబయ్య, రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ మాధవరావు పోటీల తీరును పరిశీలించారు.


పుషప్ చేస్తూ


చిన్నగ్యాలరీలో మోకాళ్లపై పాకుతూ


గాయపడిన కార్మికున్ని భుజాలపై మోస్తూ

న్యూస్‌రీల్

సింగరేణి ఎన్నికలు వాయిదా

- డిసెంబర్ 27న నిర్వహించాలని కోర్టు ఆదేశం



గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఎన్నికలపై యాజమాన్యం పైచేయి సాధించింది. గుర్తింపు ఎన్నికలు డిసెంబర్ 27న నిర్వహించాలని బుధవారం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సింగరేణిలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ కోర్టులో కేసు వేసిన నేపథ్యంలో ఈనెల 28న గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని గతంలో హైకోర్టు సూచించింది. ఈక్రమంలో డిప్యూటీ చీఫ్‌లేబర్ కమిషనర్ శ్రీనివాసులు గుర్తింపు ఎన్నికల షెడ్యూల్ ఇప్పటికే విడుదల చేశారు. ఈనెల 6,7తేదీల్లో నామినేషన్లు, ఈనెల 9న విత్‌డ్రా, 10న గుర్తుల కేటాయింపు, 28న ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అన్ని కార్మిక సంఘాలు నామినేషన్ దాఖలు చేశాయి. అయితే ఈసమయంలో ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని హైకోర్టు ఫుల్‌బెంచ్‌లో రిట్‌వేసింది. దీనిపై వాదోపవాదాలు విన్న తర్వాత డిసెంబర్ 27న ఎన్నికలు నిర్వహించాలని కోర్టు డైరెక్షన్ ఇచ్చింది. కోర్టు తీర్పుతో కొద్దిరోజులుగా సాగుతున్న చర్చకు తెరపడింది. కాగా సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం, 11కార్మిక సంఘాల కుట్ర మూలంగానే ఎన్నికలు వాయిదాపడ్డాయని, రాబోయే ఎన్నికల్లో కార్మికులు ఈవిషయాన్ని గుర్తించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య కోరారు.

'దళితబంధు పేరుతో మోసం'



మంథని: దళితబంధు పేరుతో కేసీఆర్ ప్రభుత్వం దళితులను మోసం చేస్తుందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు న్యాతరి శ్యాంసుందర్ ఆరోపించారు. బుధవారం మంథని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. దళితబంధు కేవలం హుజురాబాద్ నియోజకవర్గంలో ఇచ్చారని ఇతర నియోజకవర్గాల్లో పూర్తిగా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ఎస్సీల అభివృద్ధి జరిగిందని, కేసీఆర్ ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వస్తే ఆరు గ్యారెంటీ పథకాలు అందిస్తామన్నారు. డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, నాయకులు మంథని రాకేశ్, రవీందర్, సమ్మయ్య, జాన్, బాపు తదితరులు పాల్గొన్నారు.

పర్సనల్ జీఎంకు సన్మానం



రామగిరి(మంథని): కార్పొరేట్ పారిశ్రామిక సంబంధాలు అండ్ పర్సనల్ జీఎం హనుమంతరావును బుధవారం ఆర్జీ–3, ఏపీపీ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె. వెంకటేశ్వర్లు సన్మానించారు. పర్సనల్ జీఎంగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి ఆర్జీ–3 పర్యటనకు వచ్చిన సందర్భంగా జీఎం కార్యాలయంలో సత్కరించారు. ఎస్వోటూ జీఎం రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, డీవైపీఎంలు కావురి మారుతి, గుర్రం శ్రీహరి, సీనియర్ పర్సనల్ అధికారులు పి.రాజేశం, మదీన్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ టికెట్ కేటాయించండి



గోదావరిఖని(రామగుండం): రామగుండం బీజేపీ టికెట్ తనకు కేటాయించాలని కోరుతూ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ బుధవారం తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్‌ను కోరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై తరుణ్‌చుగ్ సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డేపల్లి రాంచందర్, నాయకులు మామిడి రాజేశ్, మాతంగి రేణుక, బోడకుంట జనార్దన్ ఉన్నారు.

గేరు మార్చిన కారు

- ప్రగతిభవన్‌కు రావాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు పిలుపు
- 15న అభ్యర్థులకు బీ ఫారాలు అందజేత
- అదేరోజు హుస్నాబాద్ నుంచి సీఎం ఎన్నికల ప్రచారం ప్రారంభం
- ఆదివారం నుంచి గులాబీ పార్టీ ప్రచారం ముమ్మరం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలకు కోడ్ రావడంతో కారు పార్టీ గేరు మార్చింది. నెలరోజుల క్రితమే అభ్యర్థులను ప్రకటించి ప్రత్యర్థులను ఊహించని అయోమయంలో పడేసిన సీఎం కేసీఆర్.. తాజాగా మరో ముందుడుగు వేస్తున్నారు. ఈనెల 15న అభ్యర్థులకు బీఫారాలు అందించనున్నారు. అదేరోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సమరశంఖం పూరించనున్నారు. అది కూడా ఆయనకు సెంటిమెంట్‌పరంగా కలిసి వచ్చిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే కావడం విశేషం. 15న ఉదయం సిట్టింగులు, కొత్త అభ్యర్థులకు బీ ఫారాలు అందించిన అనంతరం హుస్నాబాద్‌లో జరిగే సభకు హాజరవుతారని సమాచారం. సెప్టెంబరులోనే అభ్యర్థులను ప్రకటించడంతో ఆశావహులంతా వారివారి నియోజకవర్గాల్లో ప్రచారం ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ పనుల ప్రారంభోత్సవాలు, కొత్త పనులకు శంకుస్థాపనల కార్యక్రమాన్ని వేదికగా చేసుకుని అభివృద్ధి చూసి తమ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని, విపక్షాలకు అవకాశం ఇవ్వవద్దని కోరుతున్నారు.

అమావాస్య మరునాడు బీ ఫారాలు

ఇప్పటివరకు ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీ ఒక్క అభ్యర్థిని కూడా ప్రకటించలేదు. ఇదే అదనుగా గతంలో గెలిచిన సీట్ల కంటే అధిక సీట్లు గెలవాలన్న లక్ష్యంతో పావులు కదుపుతున్న కారు పార్టీ ఆదివారం నుంచి ప్రచారాన్ని హోరెత్తించనుంది. శనివారంతో అమావాస్య ముగియనుంది. మరుసటి రోజు నుంచి మరింత ముమ్మరం చేయాలన్న ప్రణాళికతో ముందుకుసాగుతోంది. ఇందులోభాగంగానే హుస్నాబాద్ సభకు జనసమీకరణ కోసం ఉమ్మడి కరీంనగర్, మెదక్, వరంగల్ అభ్యర్థులు ఉదయాన్నే బీ ఫారాలు అందుకుని వెంటనే తిరిగి రావాల్సి ఉంటుంది.

వీరికి బీ ఫారాలు..

ఉమ్మడి జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు కేటీఆర్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, రసమయి బాలకిషన్, దాసరి మనోహర్‌రెడ్డి, వొడితెల సతీశ్‌బాబు, కోరుకంటి చందర్, డాక్టర్ సంజయ్ కుమార్, సుంకె రవిశంకర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, కొత్తగా పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, చలిమెడ లక్ష్మీ నరసింహారావుకు బీ ఫారాలు అందనున్నాయి.

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..

ఉమ్మడి జిల్లాలో 13 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. క్లీన్‌స్వీప్ చేయాలని భావించిన ప్రతిసారీ కారుపార్టీకి నిరాశే మిగులుతోంది. 2014లో బీఆర్‌ఎస్ 12 స్థానాలు గెలుచుకుంది. 2018లో 11 స్థానాలు గెలవగా.. ఏఐఎఫ్‌బీ నుంచి గెలిచిన రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకోవడంతో ఎమ్మెల్యేల సంఖ్య తిరిగి 12కు చేరుకుంది. 2018లో ఈటల రాజేందర్ పార్టీకి రాజీనామా చేయడంతో మళ్లీ 11కు పడిపోయింది. ఈ క్రమంలో ఈసారి ఎలాగైనా 13 స్థానాల్లో పాగా వేయాలన్న పట్టుదలలో ఉంది గులాబీ పార్టీ. ఈ నేపథ్యంలోనే సీఎం కేసీఆర్ ఈనెల 15న హుస్నాబాద్, 17న సిరిసిల్ల, నవంబరు 3న కోరుట్ల, 7న మంథని, పెద్దపల్లిలో భారీ బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ఈ సభలను నిర్వహించడం ఆయా నియోజకవర్గ నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు.

పరిమితి మించితే అంతే..

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేలు మించి నగదు ఉంటే సీజ్
- ఇటీవల సింగరేణి కార్మికుల ఖాతాలో బోనస్, ఏరియర్స్ జమ
- సాధ్యమైనంత మేర ఆన్‌లైన్ చెల్లింపులు చేసుకోవాలి



'ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2లో పనిచేస్తున్న సింగరేణి కార్మికుడు మంగళవారం పండుగ సామగ్రి కొనుగోలుకు బ్యాంకు నుంచి రూ.3లక్షలు డ్రా చేశాడు. బ్యాంకు నుంచి ఇంటికి దాదాపు మూడు వందల మీటర్ల దూరం మాత్రమే. ఇంటికి చేరే క్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది డబ్బును పట్టుకుని సీజ్ చేశారు. ఆధారాలుంటే పోలీస్‌స్టేషన్‌లో చెప్పి నగదు తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు కేసు నమోదు చేసి ఆర్డీవోకు అప్పగించారు. ఇది ఒక్క బాధిత కార్మికుడి సమస్య కాదు. సింగరేణి కార్మికులంతా అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం. ఏరియర్స్, లాభాల వాటా, దసరా అడ్వాన్స్, దీపావళి బోనస్ అందుకుంటున్న కార్మికులు నగదు తీసుకెళ్లడం సాధ్యమైనంత మేర మానుకుంటేనే మంచిది'.

గోదావరిఖని(రామగుండం): ఎన్నికల కోడ్ కూసింది. నగదు తరలింపుపై పోలీసుల నిఘా మొదలైంది. రూ.50వేల కంటే ఎక్కువ నగదు వెంట తీసుకెళ్లే సింగరేణి కార్మికులు ఆధారాలు వెంట ఉంచుకోవాలి. లేకుంటే సీజ్ చేస్తారు. రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు చెల్లించాల్సిన అత్యవసర పని ఉంటే ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్, యూపీఐ చెల్లింపులు, ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సింగరేణి కార్మికులకు 11వ వేతన ఏరియర్స్, లాభాల వాటా, దసరా పండుగ అడ్వాన్స్, దీపావళి బోనస్ రూపంలో డబ్బులు చేతి కందనున్నాయి. బ్యాంకుల్లో జమ అయినప్పటికీ నగదు రూపంలో మార్చుకునే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన సూచిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ప్రధాన చెక్ పోస్టులతో పాటు అన్ని ఏరియాల్లో తనిఖీలు ముమ్మరం చేశాయి. ఈక్రమంలో కార్మికులు తమ ప్రణాళికలు వాయిదా వేసుకోవడంతో పాటు తప్పనిసరైతే ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా తమ పనులు నిర్వహించుకోవడం మేలు.

చట్టం ఎవరికీ అతీతం కాదు

ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూ చ తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత పోలీసు, రెవెన్యూ యంత్రాంగానికి అప్పగించింది. ఈక్రమంలో డబ్బుల విషయంలో కార్మిక క్షేత్రంలో ప్రతిఒక్కరూ జాగ్రత్త పడాలని నిపుణులు సూచిస్తున్నారు.

కార్మికులను మినహాయించాలి



కష్టార్జితం సొమ్మును కార్మికుడు బ్యాంకు నుంచి డ్రా చేసి తీసుకెళ్తుండగా పట్టుకుని కేసు నమోదు చేయడం అన్యాయం. ఎన్నికల పేరుతో ప్రజలు, సింగరేణి కార్మికులను ఇబ్బంది పెట్టడం సరికాదు.
– తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ

ఆధారాలు వెంట ఉండాలి



ఎన్నికకమిషన్ ఆదేశాల మేరకు పోలీస్ యంత్రాంగం నిఘా తీవ్రతరం చేసింది. నగదు తీసుకెళ్లే సమయంలో వాటికి సంబంధించిన ఆధారాలు చూపించాలి. కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. సీజ్ చేసిన డబ్బులను ఈకమిటీ పరిశీలిస్తుంది. సొంత డబ్బు అని ఆధారాలు చూపిస్తే రెండుమూడు రోజుల్లో వాపస్ వస్తాయి.
– తులా శ్రీనివాసరావు, ఏసీపీ, గోదావరిఖని

సిరిసిల్ల తరహాలో రామగుండం అభివృద్ధి

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): సిరిసిల్ల, సిద్దిపేట తరహాలో రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం స్థానిక 50వ డివిజన్‌లో ఓ ఫంక్షన్‌హాల్లో లక్ష్మీనగర్ వ్యాపారవర్గాలతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. గోదావరిఖని ప్రధాన వ్యాపారకేంద్రం లక్ష్మీనగర్‌లో వన్ వే ఏర్పాటుతో వ్యాపారాలు సాగక అనేక ఇబ్బందులు పడేవారని, తాను ఎమ్మెల్యేగా గెలిచాక పోలీసు అధికారులతో మాట్లాడి వన్ వే ఎత్తివేయించామని వివరించారు. బంగారం దుకాణాల యాజమానులకు పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ పరిధిలో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రతి డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేశామని వెల్లడించారు. నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, నాయకులు కౌశిక హరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అహర్నిశలు కృషి

రామగుండం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ఎమ్మెల్యే చందర్ పేర్కొన్నారు. బుధవారం 50వ డివిజన్‌లో ప్రజాఅంకిత యాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సీఎం కేసీఆర్ పథకాలు వివరించారు. మేయర్ అనిల్‌కుమార్ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, నాయకులు తానిపర్తి గోపాల్‌రావు పొన్నం లక్ష్మణ్‌గౌడ్, మునవర్ తాజ్, మహేశ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ దందాలకు అడ్డాగా రామగుండం

- డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాగూర్


ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని(రామగుండం): అక్రమ దందాలకు అడ్డాగా రామగుండం ప్రాంతాన్ని ఎమ్మెల్యే చందర్ తయారు చేశాడని డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజ్‌ఠాగూర్ విమర్శించారు. బుధవారం ప్రజాదీవెన యాత్రలో భాగంగా 37,45 డివిజన్లలో ప్రజాదీవెన యాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే 6 గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే గెలిచిన మొదటి నుంచి తన ఆస్తులను కూడబెట్టడానికే ప్రయత్నం చేస్తున్నారే తప్ప ప్రజల బాగోగులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇక్కడి వనరులు, సంపదను దోచుకుంటూ కులాల మధ్య చిచ్చు పెట్టేలా ప్రయత్నాలు చేస్తూ రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. అధికార పార్టీ నాయకులు బైండోవర్‌ల పేరుతో కాంగ్రెస్ నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అక్రమ బైండోవర్‌లను అడ్డుకోవాలని కలెక్టర్, ఎలక్షన్ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇచ్చి కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా అంతర్గాం మండలం విలేజ్ అంతర్గాం మాజీ సర్పంచ్ బీఆర్‌ఎస్ నాయకుడు టి.కొమురయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ చల్లా రవీందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఉరిమెట్ల రాజలింగం, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, సోమన్‌పల్లి మాజీ సర్పంచ్ గుంట బాపుయాదవ్, మహంకాళి స్వామి, ముస్తాఫా, దూళికట్ట సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్ల పర్యటన



రామగిరి(మంథని): ఆర్జీ–3 డివిజన్ ఓసీపీ–1, ఏపీఏ ఏరియాల్లో బుధవారం ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్, ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణ పర్యటించారు. అనంతరం ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లుతో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఏపీఏ గనిని సందర్శించి నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని జీఎంకు సూచించారు. గనిలో చేపడుతున్న రక్షణ చర్యలు, పని స్థలాల్లో తీసుకోవాల్సిన జాగ్రతలపై చర్చించారు. ఓసీపీ–1లో ఈఅండ్ఎం సత్యనారాయణ పర్యటించి ఓబీ డంపుపై నిర్మిస్తున్న సోలార్‌ప్లాంట్‌ను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సోలార్ జీఎం జానకీరామ్, ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, అధికారులు కె.నాగేశ్వర్‌రావు, కె.రాజేందర్, ఇంజినీర్ పి.నాగరాజు, ఎస్వోఎం జనార్దన్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్


సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ రెమా రాజేశ్వరి ఇతర అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ వైభవ్ గైక్వాడ్‌తో కలిసి ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై పలు సూచనలిచ్చారు. నవంబర్‌లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ప్రవర్తన నియమావళి, కోడ్ ఉల్లంఘనలపై నేరుగా, సి-విజిల్ యాప్ ద్వారా లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా కూడా ఫిర్యాదులు ఇవ్వొచ్చన్నారు. రాజకీయ పార్టీల నేతలు సభలు, సమావేశాలు నిర్వహించేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామన్నారు. సువిధా యాప్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మతవిద్వేషాలు పెంచేలా వ్యాఖ్యలు చేసినా, ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేసినా ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం అభ్యర్థులపై ఆరేళ్ల నిషేధం ఉంటుందని ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ముందస్తు అనుమతి తీసుకోవాలి

రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని సీపీ అన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు పర్యటించేటపుడు స్థానిక పోలీస్ అధికారుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఏసీపీలు ఎడ్ల మహేశ్, తులా శ్రీనివాస్ రావు, సీఐ అనిల్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ బండి ప్రకాష్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, తదితరులున్నారు

నిబంధనలు ఉల్లంఘించొద్దు

ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజకీయ పార్టీల అభ్యర్థులకోసం పోస్టర్లు, కరపత్రాలను ముద్రించే ప్రింటింగ్‌ప్రెస్ యజమానులు తప్పనిసరిగా ప్రచురణకర్త పేరు, చిరునామా, సెల్ నంబర్ ముద్రించాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ముద్రణకు ముందే డిక్లరేషన్‌పై ప్రచురణకర్త సంతకం, ఇద్దరు వ్యక్తులచే ధ్రువీకరణ సంతకాలు తీసుకోవాలన్నారు.

ముగిసిన జోనల్‌స్థాయి రెస్క్యూ పోటీలు


ఓవరాల్ విజేత ఆర్జీ–2,3, ఏపీఏ జట్టు


రెండో స్థానంలో భూపాల్‌పల్లి జట్టు

- విజేతగా నిలిచిన ఆర్జీ–2,3, ఏపీఏ
- రెండోస్థానంలో భూపాల్‌పల్లి.. మూడోస్థానం దక్కించుకున్న ఆర్జీ–1

గోదావరిఖని(రామగుండం): 52వ జోనల్‌స్థాయి రెస్క్యూ పోటీలు బుధవారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు రసవత్తరంగా సాగిన సింగరేణి మైన్స్ రెస్క్యూపోటీల విజేతల పేర్లను ప్రకటించారు. అన్ని విభాగాల్లో ప్రతిభ కనబర్చి ఓవరాల్ మొదటి స్థానంలో ఆర్జీ–2,3, ఏపీఏ జట్టు నిలిచింది. రెండో స్థానంలో భూపాల్‌పల్లి జట్టు, మూడో స్థానాన్ని ఆర్జీ–1 జట్టు కైవసం చేసుకుంది. రెస్క్యూ సభ్యులకు బహుమతులు అందజేశారు. బెస్ట్ క్యాప్టెన్‌గా ఆర్జీ–2,3, ఏపీఏ జట్టు కె.అనిల్‌కుమార్, సెకండ్ బెస్ట్ క్యాప్టెన్‌గా భూపాల్‌పల్లి జట్టుకు చెందిన కె.పూర్ణచందర్, ఫస్ట్ బెస్ట్‌మెంబర్‌గా ఆర్జీ–2,3,ఏపీఏ రాజంశెట్టి శ్రీకాంత్, సెకండ్ బెస్ట్ మెంబర్‌గా ఆబాల శ్యాంకుమార్, ఫస్ట్ ఇన్ రెస్క్యూ అండ్ రికవరీలో ఆర్జీ–2,3,ఏపీఏ జట్టు, సెకెండ్ రెస్క్యూఅండ్ రికవరీలో భూపాల్‌పల్లిజట్టు, బెస్ట్ స్టాట్యుటరీలో కొత్తగూడెం జట్టు, బెస్ట్ ఫ్రెష్ ఎయిర్‌బేస్‌లో శ్రీరాంపూర్, బెస్ట్ ఇన్‌ఫస్ట్ ఎయిడ్‌లో ఆర్జీ–1 జట్టు, బెస్ట్ ఇన్ థియరీలో ఆర్జీ–2,3, ఏపీఏ, బెస్ట్ డ్రిల్ అండ్ పరేడ్‌లో మందమర్రి అండ్ బెల్లంపల్లి టీం సత్తా చాటాయి. డిప్యూటీ డైరెక్టర్ మైన్ సేఫ్టీ భూషణ్‌ప్రసాద్ సింగ్, డైరెక్టర్లు సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్‌వీకే శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.

కోడ్ కూసినా నిద్ర లేవలే..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో సంక్షేమ పథకాలతో ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమాలపై ఎలక్షన్ కమిషన్ దృష్టి సారించి పక్కా లెక్క కడుతుంది. అయితే పెద్దపల్లిలో కొన్ని చోట్ల ఇంకా గోడలపై రాతలు అలానే ఉన్నాయి. జిల్లాకేంద్రంలోని మాతా శిశు సంక్షేమ ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద కేసీఆర్ కిట్ పేరుతో గోడలపై రాతలు తొలగించాలని కోరుతున్నారు ప్రతిపక్షాల పార్టీలకు చెందిన నాయకులు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు



పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ ఇండియా మిషన్ సెకండరీ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల పీఈటీ కృష్ణమూర్తి బుధవారం తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అక్షర, వర్షిత్, శివరామకృష్ణ, మనిత్‌రాజ్, నవతేజ్, రితికేశ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక య్యారు. ఈనెల 14 నుంచి 17 వరకు భువనగిరిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పీఈటీ పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ మహేంద్రన్, ప్రేంకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

గీతకార్మికుడికి గాయాలు



పెద్దపల్లిరూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన కొయ్యడ సారయ్యగౌడ్ బుధవారం ఉదయం ఈత చెట్టుపై నుంచి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని జిల్లా గోపా అధ్యక్షుడు బాలసాని వెంకటేశంగౌడ్, రంగాపూర్ గౌడ సంఘం అధ్యక్షుడు కొయ్యడ సతీశ్‌గౌడ్ తదితరులు పరామర్శించారు. ప్రభుత్వం సాయమందించి ఆదుకోవాలని కోరారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎనిమిది మందిని తహసీల్దార్ యాకన్న ఎదుట బైండోవర్ చేసినట్లు పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ పేర్కొన్నారు. ఇంతకు ముందు పలు నేరాలతో 8 మందికి సంబంధాలు ఉన్నాయని, ప్రవర్తన మార్చుకోవాలని తహసీల్దార్ సూచించారు.

డీజే బాక్సుల పట్టివేత

మంథని: మంథని ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో సర్వీస్ ద్వారా సౌండ్ బాక్స్‌లు, ఆంప్లీఫైర్‌లు దిగుమతి చేసి గ్రామాలకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు బుదవారం అధికారులు పట్టుకున్నారు. 12 సౌండ్స్ బాక్స్‌లు, రెండు ఆంప్లీఫైర్ బాక్స్‌లను మంథని మున్సిపల్ కమిషనర్ సతీశ్ స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాటికి సంబంధించిన బిల్లులు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


గుండెపోటుతో సింగరేణి కార్మికుడి మృతి

గోదావరిఖని(రామగుండం): స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన పెరుమాళ్ కార్తీక్ (47) బుధవారం గుండెపోటుతో మృతిచెందినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శరణ్య తెలిపారు. ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2లో సింగరేణి ఉద్యోగం చేస్తున్న కార్తీక్ ఉదయం లేచి పనులు చేస్తుండగా ఛాతీలో నొప్పిరాగా స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో సింగరేణి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాకీ లేదన్నారు.. వడ్డీ వసూలు చేశారు!

- రైతు నుంచి రూ.34,500 వసూలు
- ముత్తారం సొసైటీలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..

ముత్తారం(మంథని): ఓ రైతు తీసుకున్న లోన్ డబ్బులు గతంలోనే చెల్లించాడు. బ్యాంకు సిబ్బంది నో డ్యూ సర్టిఫికెట్ సైతం ఇచ్చారు. మళ్లీ ఇటీవల సదరు బ్యాంకు నుంచి రుణమాఫీ అయ్యిందని సెల్‌కు మెస్సేజ్ వచ్చింది. ఈక్రమంలో రైతు బ్యాంకుకు వెళ్లి అడుగగా, ఓ అధికారి లోన్ లేదని తిప్పి పంపితే.. మరో అధికారి రుణమాఫీకి వడ్డీ చెల్లించాలని డబ్బు కట్టించుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. లేని రుణానికి వడ్డీ చెల్లించిన ఘటన ముత్తారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చోటుచేసుకుంది. బాధిత రైతు సేట్‌ట్‌మెంట్ అడిగితే రేపుమాపంటూ అధికారులు నాలుగురోజులు తిప్పించుకున్నారు. చివరికి విషయం బయటకు పొక్కడంతో బాధిత రైతుతో ఆ సంఘం ప్రతినిధి చర్చలకు దిగాడు. అయితే బ్యాంకులో చెల్లించిన రుణం డబ్బు, వడ్డీ మొత్తం ఇస్తేనే ఒప్పుకుంటామని బాధిత రైతు.. ఇందుకు సొసైటీ ససేమిరా అనడంతో విషయం బయటకు వచ్చింది. చర్చలు ఫలించకపోవడంతో 'మీరు పేపర్లలో రాయించుకున్నా, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా మాకేమీ కాదు' అంటూ సంఘం ప్రతినిధులు బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు ఆరోపించారు. వివరాలు.. ముత్తారం మండలం హరిపురం గ్రామానికి చెందిన రైతు ఏగుర్ల రాజం సొసైటీలో



సొసైటీ ఇచ్చిన నో డ్యూ సర్టిఫికెట్



బాధిత రైతుకు పొంతన లేని అకౌంట్ నంబరుతో ఇచ్చిన రశీదు

2019కి ముందు రూ.50 వేల లోన్ తీసుకున్నాడు. అసలు, వడ్డీ కలిపి రూ.62,880 జూలై 2019లో చెల్లించాడు. అప్పుడు సొసైటీ నో డ్యూ సర్టిఫికెట్ ఇచ్చింది. తర్వాత 2019 ఆగస్టు 31న తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.1,50,000 రుణం తీసుకున్నాడు.

ఫోన్‌కు మెస్సేజ్ రావడంతో..

ఇటీవల రుణమాఫీ పథకంలో భాగంగా కేడీసీసీ బ్యాంకులో తీసుకున్న లోన్, వడ్డీ రూ.62,880 మాఫీ అయ్యిందని ఏగుర్ల రాజం సెల్‌కు మెస్సేజ్ వచ్చింది. ఈక్రమంలో రైతు బ్యాంకుకు వెళ్లగా ముందుగా క్యాషియర్ అకౌంట్ లేదని చెప్పి తర్వాత పెద్ద సార్‌ను కలువాలని సూచించగా సీఈవో దాసరి ప్రసాద్‌ను కలిశాడు. ఆయన రుణమాఫీ వడ్డీ రూ.34,500 అని రైతు నుంచి తీసుకొని పొంతన లేని అకౌంట్ నంబర్ రాసి రశీదు ఇచ్చాడు. విషయం బయటకు పొక్కడంతో ఆ సంఘం ప్రతినిధులు జరిపిన చర్చలకు రైతు రాజీ పడకపోవడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై సీఈవో దాసరి ప్రసాద్‌ను వివరణ కోరగా, ఏగుర్ల రాజం, మరో రైతు ఇంటి పేర్లు ఒకే అక్షరాలతో ఉండడంతో చిన్న పొరపాటు జరిగిందని, తీసుకున్న డబ్బులు చెల్లిస్తామని పేర్కొన్నారు.

రుణమాఫీకి వెళ్తే డబ్బు కట్టించుకున్నరు



రుణమాఫీ అని సెల్‌కు మెస్సేజ్ రావడంతో నా కొడుకు సాయంతో సొసైటీకి వెళ్లిన. రుణమాఫీ కావాలంటే వడ్డీ చెల్లించాలని కట్టించుకున్నరు. ఇచ్చిన రశీదులో నా అకౌంట్‌కు పొంతన లేని రంబరు రాసి మోసం చేసింద్రు. ఇలా ఎంత మంది రైతులను మోసం చేస్తున్నారో బయటపడాలి. ఈ సొసైటీ గిట్లాంటిదని అక్కడ లోన్ రద్దు చేసుకొని, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో తీసుకున్నా. సొసైటీలో నష్టపోయిన నాలాంటి రైతులు, బయటకు చెప్పుకోని వారికి న్యాయం జరగాలి. సొసైటీ అధికారులు, ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలి.

– ఏగుర్ల రాజం, రైతు, హరిపురం

నాలుగువేలు తీసుకున్నరు



ముత్తారం సొసైటీలో రూ.14వేల లోన్ తీసుకున్నా. లోన్ నుంచి రూ.4వేలు వివిధ ఖర్చుల కింద తీసుకోగా మిగిలినవి పదివేల రూపాయలే. రైతు సొసైటీ అని రుణాలు తీసుకుంటే ఖర్చులని కటింగ్ చేస్తున్నరు. వారికి భయపడి బయటకు చెప్పుకోని వారు చాలా మంది బాధిత రైతులు ఉన్నారు.

– రామంచ చిన్న పోచయ్య, హరిపురం

బొగ్గుబాయి వార్తలు

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



ఉద్యోగుల హెల్మెట్ తనిఖీ చేస్తున్న జీఎం

గోదావరిఖని(రామగుండం): రక్షణ కోసం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. బుధవారం ప్రధాన గేట్ వద్ద బైక్‌లపై వస్తున్న సింగరేణి ఉద్యోగులను జీఎం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, శరీరంలోని అన్ని అవయవాల కన్నా తల చాలా ప్రధానమైందని, తలకు గాయాలైతే చికిత్స అందించడం కష్టంగా ఉంటుందన్నారు. సింగరేణీయులందరూ హెల్మెట్ ధరించి విధులకు రావాలని సూచించారు. ఏరియా రక్షణ అధికారి బండి సత్యనారాయణ, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వేతనాలు చెల్లించాలి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతనాలు చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ అన్నారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కోల్ ఇండియా మాదిరిగా సింగరేణిలో 11వ వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పద్మ, నిర్మల, రాజనర్సు, సమ్మక్క, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్: మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఈ నెల 12,13,14 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు సుల్తానాబాద్ కేరళ మోడల్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సిజ్జు ఎస్ నాయర్ తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ రగ్బీ అండర్– 17 బాలికల విభాగంలో అమృతవర్షిని ఎస్.నాయర్, పి.జాహ్నవి, టి.సాయివీక్షిత, ఎస్.శాంతిప్రియ, ఎస్.జ్యోతి, కె.సృజన, బాలుర విభాగంలో ఎ.రిషిక్, పి.సాయితారక్, బి.శరత్, వి.అనిరుద్, జి.యశ్వంత్ ప్రతిభచాటి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను కరస్పాండెంట్ సిజ్జు ఎస్ నాయర్, స్మిత ఎస్ నాయర్, వ్యాయామ ఉపాధ్యాయుడు అజయ్‌కుమార్ అభినందించారు. అలాగే సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎస్.సాయిప్రణవి, పి.యశస్విని, ఎం.ధ్రువిత, కె.శ్రీకర్, ఎం.వరుణ్‌సందేశ్, టి.అభినయ్ రగ్బీలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు కరస్పాండెంట్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్

పనిచేసే నాయకులను గుర్తించండి

గోదావరిఖని(రామగుండం): ఈఎన్నికల్లో ఓటేయాలని అందరూ ప్రజల వద్దకు వస్తారని, పనిచేసే శక్తి సామర్థ్యాన్ని గుర్తించి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. బుధవారం శారదానగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జనగామ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొంతమంది డబ్బులు విచ్చలవిడిగా పంచి గెలుపొందాలని అనుకుంటున్నారని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తనకు చివరిసారిగా అవకాశం కల్పించాలని కోరారు. తనను గెలిపిస్తే రామగుండం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. నాయకులు జనగామ రాయలింగం, సోమారపు అరుణ్‌కుమార్, పిడుగు కృష్ణ, ఆరే దేవకర్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

బీసీ అభ్యర్థినే గెలిపించాలి

గోదావరిఖనిటౌన్(రామగుండం): రామగుండం ఎమ్మెల్యేగా బీసీనే గెలిపించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ బొల్లం లింగమూర్తి అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడిచినా బీసీ కులగణన ఊసే లేదన్నారు. తక్షణమే బీసీ కుల గణన చేపట్టి కేంద్ర కేబినెట్‌లో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి రాగానే కులగణన చేస్తానని హామీ ఇచ్చి బీసీలను మోసం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పట్టణ అధ్యక్షుడు పొల్లవేణి నరేశ్ ఆధ్వర్యంలో జరిగి కార్యక్రమంలో విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ పెంట అజయ్‌పటేల్, సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సుంకరి పోతరాజు, నాయకులు మహేందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లింగమూర్తి

మహిళా రేషన్ డీలర్ హత్య

మంథని: మంథనిలోని హనుమాన్‌నగర్‌లో మహిళా రేషన్ డీలర్ హత్య కలకలం రేపింది. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బందెల రాజమణి(37) ఈ నెల 9న రాత్రి హత్యకు గురైనట్లు పోలీసులు భావిస్తున్నారు. బుధవారం ఆటో డ్రైవర్ పైడాకుల సంతోష్ ఇంట్లో మృతదేహాన్ని గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. ముత్తారం మండలానికి చెందిన రాజమణికి లక్ష్మీపూర్‌కు చెందిన బందెల రమేశ్‌కు 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. రమేశ్ నాలుగేళ్ల క్రితం మృతిచెందాడు. రాజమణి గ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. రేషన్ సరుకులు తెచ్చే సందర్భంలో ఆటో డ్రైవర్ సంతోష్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో సంతోష్ తరచూ ఇంటికి వచ్చివెళ్లేవాడు. కొంతకాలంగా అతడితో విభేదాలు రావడంతో ఇంటికి రావడం లేదు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం సరుకుల కోసం వెళ్తున్నానని రాజమణి ఇంట్లో పిల్లలకు చెప్పి బయలుదేరింది. ఆ రోజు తన చిన్న కూతురుతో ఫోన్‌లో మాట్లాడింది. కానీ ఇంటికి తిరిగి రాలేదు. తర్వాత పిల్లలు ఫోన్ చేయగా స్పందించలేదు. ఆమె ఆచూకీ కోసం వెతుకుతుండగా మంగళవారం రాత్రి మంథనిలోని ఎరుకల గూడెంలో పైడాకుల సంతోష్ అద్దెకు ఉంటున్న ఇంట్లో మృతిచెంది ఉంది. ఆమె నుదుటిపై, గొంతుపై బలమైన గాయాలున్నాయి. రాజమణిని సంతోష్ వేధించడంతో అతడ్ని తిరస్కరించినందుకు కోపంతో పదునైన ఆయుధంతో హత్య చేసినట్లు మృతురాలి బంధువులు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితున్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతురాలి సోదరుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రాజమణి(ఫైల్)

వివాహేతర సంబంధం అనుమానంతో..

- భర్తను కడతేర్చిన భార్య

గోదావరిఖని(రామగుండం): అక్రమ సంబంధం ఏర్పర్చుకుని సొమ్మంతా వేరే ఆమెకు పెడుతున్నాడనే కారణంతో భర్తను భార్య అంతమొందించింది. ఈ ఘటన గోదావరిఖనిలో చర్చనీయాంశంగా మారింది. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు వివరాల ప్రకారం.. స్థానిక మార్కండేయకాలనీకి చెందిన కొచ్చర ప్రవీణ్(42) గోదావరిఖని చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఇళ్లు నిర్మించి విక్రయిస్తుంటాడు. కొంతకాలంగా వేరే మహిళతో అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో అతడితో భార్య లలిత రోజూ ఇంట్లో గొడవకు దిగేది. ఆస్తి వ్యవహారాలు తనకు ఏమి చెప్పడం లేదని కోపంతో ఉండేది. ఈ విషయాలన్నీ మనసులో పెట్టుకొని కోపంతో భర్తను చంపాలని నిర్ణయించుకుంది. ఈక్రమంలో తన భర్త వద్ద పనిచేసే రామగుండం ప్రాంతానికి చెందిన మచ్చ సురేశ్‌కు (సెంట్రింగ్ కార్మికుడు) తన బాధ చెప్పుకుంది. భర్తను చంపాలని, దానికి సహకరించాలని కోరగా సురేశ్ ఒప్పుకున్నాడు. ఈనెల 10న అర్ధరాత్రి ఇంట్లో ప్రవీణ్ నిద్రిస్తుండగా లలిత కాళ్లు పట్టుకోగా సురేశ్, మరికొందరు నిందితులు దిండుతో అతడి ముఖంపై గట్టిగా అదిమిపట్టుకోగా శ్వాస ఆడక చనిపోయాడు. తర్వాత నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. మృతుడి తల్లి మరియమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రవీణ్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కాగా ఇంకా పూర్తి వివరాలపై కూపీ లాగుతున్నామని, నిందితులను త్వరగా పట్టుకుంటామని సీఐ తెలిపారు.



ప్రవీణ్(ఫైల్)



మృతదేహంపై గాయాలు

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండల పరిధిలో బుధవారం ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని మృతిచెంది ఉన్నాడు. పోలీసుల వివరాలు.. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకట్రావ్‌పల్లికు చెందిన భీమోజుల సిద్ధూచారి(35) మద్యానికి బానిసయ్యాడు. జాఫర్‌ఖాన్‌పేట శివారులో చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు.

గోదావరిలో దూకి ఒకరు..

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): పాలకుర్తి మండలం జయ్యారం గ్రామానికి చెందిన ఎర్రం సురేశ్(36) బుధవారం గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సురేశ్‌కు జయ్యారం గ్రామానికి చెందిన ఉమారాణితో 8 ఏళ్ల క్రితం వివాహమైంది.ప్రస్తుతం జయ్యారంలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా సురేశ్ తన అన్నదమ్ముల మధ్య ఆస్తి పంపకాల విషయలలో బాధపడుతున్నాడు. ఈనెల 9న జగిత్యాలకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయలుదేరి జనగామ శివారులోని గోదావరిలో దూకాడు. బుధవారం మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోదావరిఖనిలో..

గోదావరిఖని(రామగుండం): స్థానిక మారుతినగర్‌కు చెందిన అంగరి సతీశ్(40) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ ఎస్‌ఐ శరణ్య వివరాల ప్రకారం.. ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసే సతీశ్ పదిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి తీవ్రం కావడంతో భరించలేక బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చీమలకుంటపల్లెలో..

గన్నేరువరం: మండలంలోని చీమలకుంటపల్లెకు చెందిన పెద్దల కొమురయ్య(40) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కొమురయ్య రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి ఇంటిఎదుట నిద్రించాడు. కుటుంబసభ్యులు బుధవారం ఉదయం చూసేసరికి కనిపించలేదు. బావివద్దకు వెళ్లి చూడగా.. అక్కడ ఓ చెట్టుకు ఉరివేసుకుని మృతిచెంది కనిపించాడు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై చందా నరసింహారావు తెలిపారు.

ఒకరి రిమాండ్

శంకరపట్నం: కులంపేరుతో దూషించిన ఒకరిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. మండలంలోని అంబాల్‌పూర్‌కు చెందిన ఎల్లాస్వామి హుజూరాబాద్‌కు చెందిన ఒకరివద్ద అప్పు తీసుకున్నాడు. తిరిగి చెల్లించాలని ఎల్లస్వామిని అడగడంతో కులంపేరుతో దూషించాడు. దీంతో వారు కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై రిమాండ్ చేశారు.



విద్యార్థుల ఇంటిబాట


కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తెలంగాణలో బతుకమ్మ పండుగ అంటే సందడి అంతాఇంతా కాదు. ఈనెల 13 నుంచి 25 వరకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. హాస్టల్‌లో ఉంటున్న తమ పిల్లలను బుధవారం నుంచే తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్తుండడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




వణికిస్తున్న వైరల్ ఫీవర్

- మంథని పరిధిలో 24 గంటల్లో ఇద్దరు మృతి

మంథని: మంథని డివిజన్‌లో పలువురు యువకులను వైరల్ ఫీవర్ బలి తీసుకుంటుండంతో ఆందోళన వ్యక్తమవుతోంది. స్థానికుల వివరాలు.. మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన సిద్ది వంశీకృష్ణ(30) జ్వరంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న అతడు కరీంనగర్, హైదరాబాద్ ఆస్పత్రుల్లో చికిత్సపొందాడు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. అలాగే మంథని పట్టణంలోని ఎరుకల గూడెంలో నివాసముండే రావికంటి సాయిచరణ్(24) వైరల్ ఫీవర్‌కు బలయ్యాడు. నాల్గు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న సాయిచరణ్‌ను కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. సాయిచరణ్ లండన్‌లో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి ఇటీవలే ఇక్కడి వచ్చాడు. కాగా మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన మోత్కూరి లింగయ్య కూతురు లావణ్య 15రోజుల క్రితం జ్వరంతో మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.




సాయిచరణ్ (ఫైల్)



వంశీకృష్ణ (ఫైల్)

విష జ్వరంతో ఆదర్శ రైతు మృతి

ముత్తారం(మంథని): మండలంలోని హరిపురానికి చెందిన సేంద్రియ ఆదర్శ రైతు బోడ తిరుపతిరెడ్డి(55) విష జ్వరంతో బాధపడుతూ బుధవారం మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. తిరుపతిరెడ్డికి పది రోజుల క్రితం జ్వరం రాగా స్థానికంగా వైద్యం చేయించుకున్నాడు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం ఒకేసారి విరేచనాలు, వాంతులు కావడంతో రామగిరి మండలం బేగంపేట క్రాస్‌రోడ్డులోని ఓ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.



తిరుపతిరెడ్డి(ఫైల్)

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన వెల్ది సంతోష్(41) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో తాగుడుకు బానిసయ్యాడు. ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు పెరుగుతున్నారు. ఇలా తాగితే వారి చదువులు, పెళ్లిల్లు ఎలా చేద్దాం అంటూ భార్య నిలదీసింది. తాగుడు మానుకోవాలని వేడుకుంది. ఈక్రమంలో సోమవారం రాత్రి ఆరెపెల్లి శివారులోని తన పత్తిచేనులో పురుగుల మందు తాగి మంగళవారం ఉదయం కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి తాను పురుగుల మందు తాగినట్లు తెలిపాడు. చేనులో అపస్మారక స్థితిలో ఉన్న సంతోష్‌ను కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు కూతుళ్లు, తల్లిదండ్రులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.



సంతోష్(ఫైల్)

నీరుకుల్లలో ఒకరు..

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన వడ్లూరి రాజేశం (50) చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్సై విజేందర్ వివరాల ప్రకారం.. రాజేశం మద్యానికి బానిస కాగా ఇంట్లో తాగవద్దని మందలించినందుకు సెప్టెంబర్ 27న ఇంట్లో ఏవరూ లేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి సుల్తానాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విషమించడంతో హైదారాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు. కూతురు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.